రాష్ట్ర అవతరణ వేడుకకు ఘనంగా ఏర్పాట్లు చేయాలి

అధికారులకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశం

పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో వేడుకల పనుల పరిశీలన

ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, మే 30: జూన్ 2న జరుగనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను అట్టహాసంగా నిర్వహించేలా ఘనంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న వేడుకల ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణ పరిస్థితుల అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వేడుకల వేదికల ఏర్పాట్లు ఆకర్షణీయంగా ఉండాలన్నారు. వీఐపీలు, ప్రజలు సౌకర్యవంతంగా కూర్చునేలా గ్యాలరీలు ఉండాలని, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని, ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానాలు అందించాలని సూచించారు. వేడుకల షెడ్యూల్ తయారు చేయాలని సూచించారు. స్టాళ్లు, శకటాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు ఉండాలన్నారు. డీఆర్‌వో పద్మశ్రీ, పోలీస్ అడ్మిన్ ఆర్ఐ కామరాజు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, ఆర్ఐ వహీద్ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక అధ్యాపకుల భర్తీకి 700 మంది హాజరు

ఖమ్మం అర్బన్, మే 30:ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకులు, ఉపాధ్యాయుల పోస్టులను తాత్కాలిక పద్ధతిన భర్తీ చేసే ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఖమ్మంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో డెమోలు నిర్వహించారు. మొత్తం 68 పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానించగా 1,165 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. వీరికి వివిధ కళాశాలల్లో పనిచేస్తున్న సబ్జెక్టు నిపుణులతో ప్యానెల్ కమిటీలు ఏర్పాటు చేసి డెమోలు నిర్వహించారు. ఎనిమిది సబ్జెక్టులకుగాను ఒక్కో సబ్జెక్టుకు మూడు ప్యానెళ్ల ద్వారా డెమోలు తీసుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన ప్రక్రియలో 700 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ ప్రక్రియను జోనల్ ఆఫీసర్ కే.స్వరూపరాణి పర్యవేక్షించారు. ఎంపికైన అభ్యర్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించనున్నట్లు ఆమె తెలిపారు.

కొనసాగుతున్న 'దోస్త్' ప్రవేశాలు

ఖమ్మం అర్బన్, మే 30: దోస్త్ 2025 డిగ్రీ ప్రథమ సంవత్సర ప్రవేశాల్లో భాగంగా మొదటి విడతలో సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 6లోగా సెల్ఫ్ రిపోర్ట్ చేసుకోవాలని ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాకీరుల్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో విడత ప్రవేశాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోందని దోస్త్ కో ఆర్డినేటర్ ఎండీ సలీంపాషా వెల్లడించారు. జూన్ 9 వరకు విద్యార్థులు రెండో విడత రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు.

'బీపీఎస్' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మామిళ్లగూడెం, మే 30: ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కీం (బీపీఎస్) ద్వారా ఎంపిక చేసిన ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాల కోసం అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆ శాఖ డీడీ కస్తాల సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి రెసిడెన్షియల్ పద్ధతిలో 5వ తరగతిలో 131సీట్లు, నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో 1వ తరగతిలో 128సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ దరఖాస్తు ఫారాలను జూన్ 2 నుంచి 16 వరకు కలెక్టరేట్‌లోని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయంలో పొందాలని సూచించారు. ఆ దరఖాస్తులకు నిర్దేశించిన ధ్రువపత్రాలను జతచేసి జూన్ 16న సాయంత్రం 5 గంటల లోపు తమ కార్యాలయంలో అందించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం తమ కార్యాలయ పనివేళలలో సంప్రదించాలని కోరారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి: సీపీఎం

మామిళ్లగూడెం, మే 30: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలను అమలుచేయాలని, రైతు కూలీలకు రూ.12 వేలు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలను అమలుచేయకుండా రేవంత్ ప్రభుత్వం.. రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. అలాగే, కార్మికుల కోసం, పేదల కోసం తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, మేరుగు సత్యనారాయణ, ఎర్రా శ్రీనివాసరావు, కృష్ణ పాల్గొన్నారు.

తెలంగాణా ప్రభుత్వము
సాంకేతిక విద్యాశాఖ
గవర్నమెంట్ పాలిటెక్నిక్ హాస్టల్, మధిర, ఖమ్మం జిల్లా - 507203
నెం.జిపిటి-ఎండిఆర్/125/హాస్టల్ టెండర్/2025 తేది. 30/05/2025
టెండర్ ప్రకటన
గవర్నమెంట్ పాలిటెక్నిక్ హాస్టల్, మధిర, ఖమ్మం జిల్లా - 507203, 2025-26 విద్యా సంవత్సరమునకు హాస్టల్ నందు **"మెస్ మరియు మెయింటినన్స్"** చేయుటకు ఖమ్మం జిల్లా వాస్తవ్యులు మాత్రమే అయివుండి, అర్హత / ఆసక్తి మరియు అనుభవం కలిగిన వారి నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండర్ ఫాం మరియు ఇతర వివరములు కొరకు ప్రిన్సిపాల్ గవర్నమెంట్ పాలిటెక్నిక్, మధిర ఆఫీసు నందు **తేది. 02-06-2025 ఉదయం 10.00 గంటల** నుండి 500/- రూపాయలు చెల్లించి పొందగలరు. టెండర్ ప్రతి ఫాం సమర్పించుటకు చివరి **తేది. 12-06-2025 మధ్యాహ్నం 3.00 గంటలవరకు.** వివరములకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు. **9010222181, 7995092181.**
Officer on Special Duty, Government Polytechnic, Madhira, Khammam District.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

* I, **VAKALA VENKATA SATYA SAI PRASAD,** S/o. VAKALA PANDURANGA RAO CHANGED MY NAME AS **VAKALA SATYA SAI PRASAD,** R/O. H.NO. 8-1-21/3, BABU CAMP, CHUNCHUPALLI, KOTHAGUDEM - 507101, BHADRADRI KOTHAGUDEM DIST. T.G.
KMM -

CHANGE OF NAME

* I, **MULKA CHARLES POSNETT,** S/o. MULKA BENJAMIN, CHANGED MY WIFE NAME AS **SARALA** (OLD NAME) **@ MENTUM SARALA,** (NEW NAME) R/o. Q.NO: BC-203, BABU CAMP, KOTHAGUDEM TOWN, BHADRADRI KOTHAGUDEM DIST.
KMM -

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్రెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నకిలీ విత్తనాలు అమ్మితే కటకటాలపాలు

జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

వేంసూరు: ఎరువుల షాపులో విత్తనాలు తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

వేంసూరు, మే 30: నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు రైతులకు అంటగట్టి, సొమ్ము చేసుకోవాలని ప్రయత్నిస్తే కటకటాలపాలు తప్పదని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని శుంభునిగూడెం రైతువేదికలో జరుగుతున్న రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఏఈవోలను సూచించారు. అనంతరం బీరపల్లి, కుంచపర్తి, అడసర్లపాడు, మర్లపాడు, కందుకూరు గ్రామాల్లో విత్తన, ఎరువుల, పురుగుమందుల దుకాణాల్లో తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏవో పీ.రామ్మోహన్, ఏఈవోలు కావ్య, నవ్య, రీమా, స్వాతి, అక్షర, కందుకూరు సొసైటీ అధ్యక్షుడు గొర్ల సంజీవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

ఖమ్మం రూరల్, మే 30: రైతులకు నకిలీ విత్తనాలు,ఎరువులు అమ్మితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కూసుమంచి డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు బీ సరిత హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని తల్లంపాడు గ్రామంలోని విత్తన షాపుల్లో రూరల్ ఎస్సై వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయశాఖ అధికారి ఉమానగేష్‌తో కలిసి తనిఖీలు చేపట్టారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ కొనుగోలు చేసిన సమయంలో తీసుకున్న బిల్లులను రైతులు పంట చేతికి వచ్చే వరకు భద్రపరచుకోవాలన్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే సాగు రైతులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో విత్తన డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

బోనకల్లులో..

బోనకల్లు, మే 30: మండలంలోని విత్తన షాపులను మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర, మండల వ్యవసాయ అధికారి పసునూరి వినయ్‌కుమార్, బోనకల్లు ఎస్సై పొదిలి వెంకన్న శుక్రవారం తనిఖీ చేశారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో రైతులకు నాణ్యమైన విత్తనాల ఎంపికలో జాగ్రత్త వహించాలన్నారు. ఎవరైనా డబ్బు అడ్వాన్స్‌గా తీసుకుంటూ విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయశాఖ అధికారులకు తెలపాలన్నారు.

మధిరలో..

మధిర, మే 30: మండలంలోని విత్తన దుకాణాలను టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం తనిఖీ చేసింది. మధిర పట్టణ సీఐ రమేశ్, మధిర రూరల్ ఎస్సై లక్ష్మీభార్గవి, మండల వ్యవసాయ అధికారి కే.సాయిదీక్షిత్ విత్తన షాపుల లైసెన్స్‌లు, విత్తనాల స్టాక్ పరిశీలించారు. నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గడ్డి మందు తట్టుకునే రకాలు అంటూ బీటీ-3 విత్తనాలు అమ్ముతున్న వారిని గుర్తించినప్పుడు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీసు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

కూసుమంచిలో..

కూసుమంచి, మే 30: కూసుమంచిలోని విత్తనాల, ఎరువుల షాపులను మండల వ్యవసాయాధికారి రాము డుగు వాణి, ఎస్సై నాగరాజు విత్తన,ఎరువుల షాపులను శుక్రవారం తనిఖీ చేశారు. డీలర్లు విత్తన చట్టాలకు లోబడి వ్యాపారం చేయాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కారేపల్లిలో..

కారేపల్లి, మే 30: కారేపల్లిలోని ఎరువులు, విత్తన దుకాణాల్లో గురువారం ఏవో బట్టు అశోక్‌కుమార్, ఎస్సై ఎన్.రాజారాం తనిఖీలు నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో ఎరువులు, విత్తనాల నిల్వ తదితర రికార్డులను పరిశీలించారు. మాట్లాడుతూ.. దుకాణదారులు తప్పనిసరిగా ధరల, సరుకు నిల్వ వివరాల పట్టికను అందుబాటులో ఉంచాలన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ఎల్లమ్మ(ఫైల్)

కూసుమంచి, మే 30: మండలంలోని తురకగూడెం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు కొమ్ము ఎల్లమ్మ(102) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. నాలుగు తరాలు చూసిన ఎల్లమ్మకు ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. ఎల్లమ్మ భౌతికకాయాన్ని పలువురు సందర్శించి నివాళి అర్పించారు.

వందరోజుల ప్రణాళికపై నేడు సదస్సు

ఖమ్మం రూరల్, మే 30: రాబోయే వందరోజులలో మున్సిపాలిటీ పరిధిలో చేపట్టబోయే అభివృద్ధి పనులు, ప్రణాళిక అమలుపై శనివారం ఉదయం 10.30గంటలకు సత్యనారాయణపురం లోని టీసీవీ ఫంక్షన్‌హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏదులాపురం మున్సిపాలిటీ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

3 నుంచి రెవెన్యూ గ్రామసభలు

ఖమ్మం రూరల్, మే 30: జూన్ 3 నుంచి 21వ తేదీ వరకు రూరల్ మండలం, ఏదలాపురం మున్సిపాలిటీ పరిధిలో గ్రామ రెవెన్యూ సభలు నిర్వహిస్తామని తహసీల్దార్ పీ రాంప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సభలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తామన్నారు. సర్వే నెంబర్ మిస్సింగ్, పెండింగ్ మ్యుటేషన్, సర్వేనెంబర్ మిస్‌మ్యాచ్, భూమి రికార్డుల్లో తప్పులు, అర్హత కలిగినప్పటికి రికార్డులలో నమోదు కాకపోవడం తదితర సమస్యలు ఉన్న రైతులు గ్రామ సభలలో నేరుగా రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు అందజేయాలన్నారు.

వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించిన టీజీఐడీసీ చైర్మన్

పెనుబల్లి, మే 30: మండలంలోని లంకపల్లి గ్రామంలో గల వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్న పామాయిల్, కొబ్బరి తోటలను టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు శుక్రవారం పరిశీలించి రైతులకు పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

ఎకో టూరిజం ప్రాజెక్టును పరిశీలించిన మంత్రి తుమ్మల

మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

పెనుబల్లి, మే 30: సత్తుపల్లి నియోజకవర్గంలోని పెనుబల్లి మండలం పులిగుండాల ప్రాజెక్టు, కనిగిరి గుట్టలు, వీర భద్రస్వామి ప్రాచీనగుడి కట్టడాలను ఎకో టూరిజం ఏర్పాటు చేసేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మట్టా రాగమయి శుక్రవారం పరిశీలించారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే ఒక గొప్ప టూరిజం ప్రాంతంగా తీర్చిదిద్దుదామని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రస్తుతం సుమారు రూ.4.5 కోట్లను అందించబోతుందని తెలిపారు. పర్యాటకులు రెండు, మూడు రోజులు ఇక్కడే ఉండే విధంగా రూమ్స్, హోటల్స్, ఆహ్లాదకరమైన ఏర్పాట్లు, బోటింగ్ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో నీలాద్రి గుడి అటవీ ప్రాంతాన్ని కూడా టూరిజం ప్రాంతంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, సీసీఎఫ్ భీమానాయక్, డీఎఫ్ఓ విక్రమ్‌సింగ్‌సిద్ధార్థ్, ఎఫ్‌డీవో మంజుల, ఎఫ్ఆర్‌వోలు ఉమా, స్నేహలత, డీఆర్‌వోలు రాంసింగ్ సురేశ్, ఆర్‌కేవీహెచ్.ఈశ్వర్‌రావు, పెనుబల్లి, కల్లూరు ఏఎంసీ చైర్మన్లు దోమ ఆనంద్, భాగం నీరజ, నాయకులు రాయల నాగేశ్వరరావు, మట్టా దయానంద్‌వి, అధ్యక్షులు దుగ్గప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'టీజేఎఫ్ రజతోత్సవ సభకు తరలిరండి'

ఖమ్మం సిటీ, మే 30: 'తెలంగాణ రాష్ట్ర సాధన కోసమే తెలంగాణ జర్నలిస్టులు' అనే నినాదంతో ఆవిర్భవించిన 'తెలంగాణ జర్నలిస్టుల ఫోరం' పాతికేళ్లు పూర్తిచేసుకుంటోందని టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో శనివారం నిర్వహిస్తున్న ఫోరం రజతోత్సవ మహాసభకు జిల్లాలోని జర్నలిస్టులందరూ తరలిరావాలని కోరారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన ఆ సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ.. అల్లం నారాయణ సారథ్యంలో ఏర్పడిన ఫోరం.. 2001 నుంచి 2014 వరకు అనేక ఉద్యమాలు నిర్వహించి పోలీసు నిర్బంధాలను, కేసులను ఎదుర్కొని తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిందని గుర్తుచేశారు. అనంతరం ఖమ్మంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఫోరం బాధ్యులు వెన్నబోయిన సాంబశివరావు, ప్రశాంత్‌రెడ్డి, రామిశెట్టి విజేత, మందటి వెంకటరమణ, మందుల ఉపేందర్, అమరవరపు కోటేశ్వరరావు, కాపర్తి నరేందర్, కొరకొప్పుల రాంబాబు, టీఎస్ చక్రవర్తి, శ్రీధర్ శర్మ, యలమందల జగదీశ్, తిరుపతిరావు, బిక్కి గోపి, సాయి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు కుదిస్తే సహించేది లేదు

వైరాటౌన్, మే 30: వైరా రింగు రోడ్డు నుంచి వైరా ప్రాజెక్ట్ కుడి కాల్వ వరకు 26 అడుగుల వెడల్పుతో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను అఖిలపక్ష రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం నిలిపివేశారు. గతంలో నిర్ణయించిన ప్రకారం 20అడుగుల రోడ్డు నిర్మాణం చేయాలని, 60 అడుగుల వెడల్పుతో బౌండరీ రాళ్ళు వేస్తూ రోడ్డు, ఫార్మేషన్ చేయాలని, నిధులు మంజూరైన దానిని బట్టి కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అఖిలపక్ష రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో పనులు నిలిపివేశారు. డీఈ నరేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతిపాదన ఇచ్చిన ప్రకారం రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని అఖిలపక్ష నాయకులకు చెప్పడంతో, రోడ్డు నిర్మాణానికి సంబంధించిన అన్ని రకాల కొలతలు చూపించిన తర్వాతే నిర్మాణం చేపట్టాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేయడంతో పనులు నిలిపివేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. తక్షణమే భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని వైరా ప్రాజెక్ట్ ఆనకట్ట సంబంధించిన రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. భూక్యా వీర భద్రం, బొంతు రాంబాబు, చెరుకూరి చలపతిరావు, సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, యామాల గోపాలరావు, పారుపల్లి కృష్ణారావు, బొంతు సమత, కొంగర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వాడడం చట్టరీత్యా నేరం

ఎర్రుపాలెం, మే 30: యువత చదువుని నిర్లక్ష్యం చేస్తూ డ్రగ్స్‌కు ఆకర్షితులై వారి జీవితాలను నాశనం చేసుకుంటూ వారి భవిష్యత్‌ను కోల్పోతున్నారని గంజాయి మాదక ద్రవ్యాలు వాడటం, అమ్మడం చట్టరీత్యా నేరమని మధిర సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎన్.ప్రశాంతి అన్నారు. 'చెడు వ్యసనాలు వద్దు- పోరాటాలే ముద్దు' అంటూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం నుంచి జూన్ 10 వరకు నిర్వహించనున్న యువచైతన్య సైకిల్‌యాత్ర మండలంలోని జమలాపురం వాసిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జడ్జి ప్రశాంతి డీవైఎఫ్ఐ జెండాను ఊపి ప్రారంభించారు. డీవైఎఫ్ఐ నూతన దిమ్మెను డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జీ మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటుపడిన కొంతమంది యువత పట్టుబడి చిన్నవయస్సులో కోర్టుకు వస్తున్నారని, ఒకసారి వారికి శిక్ష పడితే వారి జీవితం నాశనం చేసుకుంటూ ఎందుకు పనికి రాకుండా పోతారన్నారు. కార్యక్రమంలో ఎస్సై రమేష్, ఎంఈవో ప్రశాంత్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్, జిల్లా కార్యదర్శి బషీరుద్దీన్, రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేశ్, లాయర్ అసోసియేషన్ నాయకులు దిరిశాల జగన్మోహన్‌రావు, గంధం శ్రీనివాసరావు, సతీష్, భీవీకే చైర్మన్ శ్రీనివాసరావు, విశ్రాంతి ఉద్యోగులు, రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

రైతులకు విత్తన కంపెనీ డబ్బులు చెల్లించాలి

వైరాటౌన్, మే 30: యాసంగిలో విత్తన మొక్కజొన్న పండించి కంపెనీకి అప్పజెప్పి రెండునెలలు దాటినా కంపెనీ యాజమాన్యం, ఏజెంట్ కుమ్మక్కై రైతులకు డబ్బులు చెల్లించకుండా బోర్డు తిప్పి వేసే ప్రయత్నం చేయడంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు చింతనిప్పు చలపతిరావు డిమాండ్ చేశారు. శుక్రవారం వైరాలో కామేపల్లి, జూలురుపాడు, కొణిజర్ల, వైరా మండలంలో విత్తన మొక్కజొన్న సాగు చేసిన బాధిత రైతుల సమావేశంలో రాంబాబు, చలపతిరావు మాట్లాడారు. విత్తన కంపెనీ రైతులు బ్యాంకు ఖాతాలకు నేరుగా డబ్బులు జమ చేయకుండా కంపెనీ ఏజెంట్ బ్యాంకు ఖాతాకు జమ చేయడంతో రైతులకు ఏజెంట్ డబ్బులు ఇవ్వకుండా తప్పించుకొని తిరుగుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇలాంటి కంపెనీలు, ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. నునావత్ సూర్య, తేజావత్ సురేష్, దొంగల నాగరాజు, ఇనుకొండ భాస్కర్, ఆంగోతు చిన్న, జక్కంపూడి శ్రీను, జర్పుల శ్రీను, మల్లెంపాటి రామారావు, దొంతిబోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అశాస్త్రీయ సర్దుబాటు ఉత్తర్వులను సవరించాలి

సత్తుపల్లి, మే 30: ప్రభుత్వం రాబోయే విద్యా సంవత్సరానికి ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు విడుదల చేసిన ఉత్తర్వులు అశాస్త్రీయంగా ఉన్నాయని, వీటిని ఉపసంహరించి సవరణ ఉత్తర్వులు జారీ చేసి సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ సత్తుపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెరుకు శ్రీనివాసరావు, కొక్కరగడ్డ వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలను ఈ సర్దుబాటు ప్రక్రియ తీవ్రంగా దెబ్బతీస్తుందని, టీచర్లు లేక పిల్లల్లో విద్యా ప్రమాణాలు పడిపోతాయని తెలిపారు. 11 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు, 60 మందికి కూడా ఇద్దరు టీచర్లతోనే బోధన ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. వర్క్ బుక్స్ ఉన్న నేపథ్యంలో 15 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఉండాలని వారు తెలిపారు. రేషనలైజేషన్ నిబంధనల జీవో 25ను సవరించాలని కోరారు. ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని ఉపాధ్యాయడిని కేటాయించాలని, నర్సరీ, కేజీ తరగతులకు ప్రవేశపెట్టాలని ఆప్రకటనలో డిమాండ్ చేశారు.

కేఎంసీ డీఈఈ బదిలీ

ఖమ్మం, మే 30: ఖమ్మం నగర పాలక సంస్థలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న జ్యోతి బదిలీ శుక్రవారం అయ్యారు. ఆమెను హెచ్ఎండీఏ పరిధిలోని పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీకి బదిలీ చేస్తూ పురపాలకశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె స్థానంలో ఎవరినీ నియమించలేదు. పబ్లిక్ హెల్త్ విభాగంలో డీఈఈ నవీన్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

శ్రీఉత్రేశ్వరస్వామి ఆలయ భూముల వేలం

కూసుమంచి (నేలకొండపల్లి) మే 30: మండల కేంద్రమైన నేలకొండపల్లిలోని శ్రీఉత్రేశ్వరస్వామి దేవస్థాన భూములకు శుక్రవారం కౌలు వేలం నిర్వహించారు. దేవస్థానం ఆధీనంలోని మూడు ఎకరాల 29 కుంటల భూమికి వేల నిర్వహించారు. దేశబోయిన లక్ష్మయ్య రూ. 60వేలకు వేలం పాడారు. కార్యక్రమంలో ఈవో కాముని శ్రీకాంత్, కల్యాణి వెంకటేశ్వర్లు, పూజారి శివయ్య తదితలు పాల్గొన్నారు.

భద్రమ్మ సేవలు మరువలేనివి

భద్రమ్మ స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

బోనకల్లు, మే 30: తెలంగాణ రైతాంగం సాయుధ పోరాటంలో భర్త భాగస్వామ్యంతో తమ్మారపు భద్రమ్మ ఉద్యమించారని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. శుక్రవారం మండలంలోని గోవిందాపురం-ఎల్ గ్రామంలో సీపీఐ నాయకుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు తమ్మారపు భద్రయ్య సతీమణి తమ్మారపు భద్రమ్మ 7వ వర్ధంతిని నిర్వహించారు. భద్రమ్మ స్థూపానికి ఆనందరావు, నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైజాం నవాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుటుంబ సభ్యుల అడుగు జాడల్లో నడుస్తూ కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. నెహ్రూ సైన్యాలు కమ్యూనిస్టులను నిషేధం చేయడంతో భర్తను రహస్యంగా ఉంచి కుటుంబాన్ని పోషించి ఉద్యమానికి మరింతగా సహకరించారన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జక్కుల రామారావు, కుటుంబ సభ్యులు తమ్మారపు వెంకటేశ్వర్లు, తమ్మారపు బ్రహ్మం, తమ్మారపు భిక్షాలు, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్ర